

సమీక్షలో పాల్గొన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, అధికారులు

## తుది దశకు మాస్టర్ ప్లాన్

**2050 విజన్‌తో రూపకల్పన**

- మూడు దశల్లో ఓఆర్ఆర్ నిర్మాణ పనులు
- ఏడాదిలోగా అందుబాటులోకి ఎయిర్‌పోర్టు
- తక్షణం భద్రకాళీ చెరువు పూడిక తీయాలి
- ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వరంగల్ నగరాభివృద్ధిపై హైదరాబాద్‌లో సమీక్ష

వరంగల్, నవంబరు 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 2050 జనాభాను దృష్టిలో పెట్టుకొని వరంగల్ నగరాభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్ తుది దశకు చేరుకున్నదని వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా త్వరలోనే విడుదల చేస్తామని చెప్పారు. మాస్టర్ ప్లాన్, వరంగల్ ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్, భద్రకాళీ ఆలయ అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మెగా టెక్స్‌టైల్ పార్క్, మామునూరు ఎయిర్‌పోర్ట్, ఎకో టూరిజం అంశాలపై హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నగరానికి దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. నగరంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్‌కు అవసరమైన భూసేకరణను యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. 41 కిలోమీటర్ల పరిధి ఉన్న ఔటర్ రింగ్ రోడ్డును మూడు దశల్లో చేపట్టాలని సూచించారు. మొదటి దశలో 20 కిలోమీటర్లు, రెండో దశలో 11, మూడో దశలో 10కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. మామునూరు ఎయిర్‌పోర్టు పనులను ఏడాదిలోపు పూర్తి చేసి సేవలను ప్రజలను అందుబాటులోకి తెచ్చేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. 382 ఎకరాల పరిధిలో భద్రకాళీ చెరువులో పూడిక తీయాలని, బుధవారం నుంచి ఈ పనులు చేపట్టాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా నీరు ఖాళీ చేయాలని అధికారులను ఆదేశించారు. మెగా టెక్స్ టైల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన కంపెనీలు తప్పనిసరిగా స్థానికులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వీలైనంత త్వరగా మొదలుపెట్టేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి బీ అజిత్ రెడ్డి, మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్, ఆర్అండ్‌బీ కార్యదర్శి హరిచందన, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు పీ ప్రావీణ్య, డాక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ పాల్గొన్నారు.

## 8 నుంచి టెక్నోజియాన్

- 50కిపైగా ఈవెంట్ల ప్రదర్శన
- నిట్‌లో మూడు రోజులు సందడే సందడి

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 5 : వరంగల్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) టెక్నోజియాన్ వార్షిక టెక్నికల్ ఫెస్టివల్‌కు ముస్తాబైంది. ఈ నెల 8 నుంచి 10 వరకు పలు రకాల ఈవెంట్లకు వేదిక కానుంది. 2006లో ప్రారంభమైన టెక్నోజియాన్ సాంకేతిక పురోగతిని పెంపొందించడంలో, యువకులకు వేదికను అందించడంలో ముందంజలో ఉంది. ఈవెంట్ టీజర్‌ను నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మంగళవారం విడుదల చేశారు. ఈ సంవత్సరం డిపార్ట్‌మెంట్ సొసైటీలు, క్లబ్‌ల ద్వారా 50కి పైగా ప్రదర్శనలు నిర్వహిస్తామని, కీ నోట్ సెషన్లు, స్పాట్‌లైట్ ఈవెంట్లు ఉంటాయని తెలిపారు. టెక్నోజియాన్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు https://technozion.nitw.ac.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.




నిట్‌లో ఆవిష్కరించిన టెక్నోజియాన్ టీజర్

## కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎంపీ కవిత



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న మాజీ ఎంపీ కవిత

బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును మంగళవారం ఎర్రవల్లిలో మహబూబాబాద్ మాజీ ఎంపీ, జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాలోత్ కవిత మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకురాలు హరితమ్మ తదితరులు ఉన్నారు.

– మహబూబాబాద్ రూరల్, నవంబర్ 5



బరిగలానిపల్లిలోని వరాల గుట్ట



గుట్టపై నరికిన టేకు చెట్టు

# స్మగ్లర్లకు వరాల గుట్ట

## టేకు కలపపై కన్నేసిన దొంగలు

- ఇప్పటికే 130 చెట్ల నరికివేత
- అండగా నిలుస్తున్న అటవీ అధికారులు
- ఏడాదిన్నర క్రితం ఒకరి సస్పెన్షన్
- మళ్లీ వెలుగులోకి అక్రమ దందా..

ములుగు రూరల్, నవంబర్ 5 : కాకతీయులు నడయాడిన ములుగు జిల్లాలోని బరిగలానిపల్లి గ్రామంలోని వరాల గుట్టపై కలప స్మగ్లర్ల కన్ను పడింది. వందల సంఖ్యలో ఉన్న టేకు చెట్లను రాత్రికి రాత్రే యంత్రాలతో కోసి గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఈ తతంగమంతా అటవీ శాఖ అధికారుల అండదండలతోనే జరుగుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతున్నది. కంచే చేను మేసిన చందంగా ఏడాదిన్నర క్రితం ఇదే గుట్టపై ఉన్న 70 నుంచి 80 టేకు చెట్లను నరికిన ఘటనలో అప్పుడు బీట్ ఆఫీసర్‌గా పనిచేసిన సీహెచ్ నర్సింహారావు హస్తం ఉన్నట్లు గుర్తించిన అటవీశాఖ అధికారులు అతడిని సస్పెండ్ చేశారు. ఈ సమయంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో గుట్టపై టేకు చెట్లను లెక్కించగా సుమారు 1015 ఉన్నట్లు గుర్తించారు. అందులో 500 వరకు దుంగ సైజు చెట్లు ఉన్నట్లు నిర్ధారించారు. కాగా, ప్రస్తుతం స్మగ్లింగ్ దందా మళ్లీ వెలుగులోకి వచ్చింది. కొన్ని రోజులుగా గుట్టపై టేకు చెట్ల నరికి వేత జోరుగా సాగుతున్నది. అక్కడ విధులు నిర్వర్తించే బీట్ ఆఫీసర్ సహాయంతో స్మగ్లర్లు 130 చెట్లను నరికినట్లు సమాచారం. అటవీ సంపదను, వన్య ప్రాణులను కాపాడాల్సిన అధికారులే ఆ శాఖకు మచ్చ తీసుకువచ్చేలా అడవి ధ్వంసానికి పాల్పడుతున్నారు. విలువైన టేకు సంపద గుట్టపై ఉన్నప్పటికీ దానిని కాపాడడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. అధికారుల అండదండలతో స్మగర్లు టేకు దుంగలను నరికి రాత్రికి రాత్రే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తులెవరు? ఏ ప్రాంతానికి తరలిస్తున్నారు? అనేది తెలియరావడం లేదు.

### బాధ్యులపై చర్యలు తీసుకుంటాం



వరాల గుట్టపై టేకు చెట్లను నరికి వేసిన వారిని గుర్తించి అటవీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. గుట్టపై 130 వరకు చెట్లను నరికివేశారని జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదు. ఈ రోజు సిబ్బందితో వెళ్లి నరికిన చెట్లను గుర్తిస్తాం. కలప స్మగ్లింగ్‌లో అటవీ శాఖ అధికారుల ప్రమేయం ఉంటే ఉపేక్షించేది లేదు. దీనిపై విచారణ జరిపిస్తాం. విషయం తెలిసిన వెంటనే సాయంత్రం బరిగలానిపల్లి గ్రామానికి సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేశాం. కార్పెంటర్ షణ్ముఖచారి వద్ద 10 టేకు సైజులను గుర్తించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కలపను స్వాధీనం చేసుకున్నాం. దూగడ మిషన్‌ను సీజ్ చేసి కార్యాలయానికి తరలించాం. షణ్ముఖచారిపై కేసు నమోదు చేశాం. తనిఖీ చేస్తున్న క్రమంలో గ్రామంలోని కొంతమంది మా విధులకు ఆటంకం కలిగించి గొడవకు దిగారు. అటవీ సంపదను ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.


– డోలి శంకర్, ఎఫ్ఆర్వో, ములుగు



వరాల గుట్టపై రక్షణ కోసం కాకతీయులు ఏర్పాటు చేసిన రాళ్ల గోడ

## పోరాట యోధుడు నల్ల నర్సింహులు

- వీరులు, కవులకు జన్మనిచ్చిన పాలకుర్తి గడ్డ
- విగ్రహావిష్కరణ సభలో మాజీ మంత్రి ఎర్రబెల్లి
- పాల్గొన్న సీపీఐ జాతీయ నేత నారాయణ




సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి, నవంబర్ 5 : పాలకుర్తి ప్రాంత ప్రజల ముద్దుబిడ్డ, పోరాట యోధుడు, భవిష్యత్ తరాలకు స్ఫూర్తి ప్రదాత నల్ల నర్సింహులు అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని జనగామ రోడ్డులో కామ్రేడ్ నల్ల నర్సింహులు విగ్రహావిష్కరణ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకిటి రాజుకుమార్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఆనంతరం పద్మశాలీ సంఘం మండలాధ్యక్షుడు మాచర్ల సారయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పోరాటయోధులు, వీరులు, కవులకు జన్మనిచ్చిన గడ్డ పాలకుర్తి అని కొనియాడారు. నల్ల నర్సింహులు విగ్రహానికి తనవంతు సాయం చేశానన్నారు. పాలకుర్తి ప్రాంతంలో మహనీయుల విగ్రహలు నెలకొల్పానన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కామ్రేడ్ నల్ల నర్సింహులు అణగారిన వర్గాల బిడ్డ అని అన్నారు. నల్ల నర్సింహులు, రావి నారాయణరెడ్డి, చాకలి ఐలమ్మ, బందగీ పోరాటాలు మరిచిపోలేనివన్నారు. అణగారిన వర్గాల బిడ్డ కావడంతోనే నర్సింహులు పోరాట చరిత్ర బయటకు రాలేదన్నారు. నల్ల నర్సింహులు శత జయంతి ఉత్సవాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు మూర్ఖులని, సాయుధ పోరాట చరిత్ర తెలియని అజ్ఞానులని మండిపడ్డారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, బీజేపీ నేత ప్రశాంత్‌రెడ్డి తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను అవహేళన చేస్తున్నారన్నారు. జనగామ జిల్లాలో ప్రతి గ్రామానికి ఓ చరిత్ర ఉందని, నర్సింహులును జైలులో పెట్టి చిత్ర హింసలకు గురిచేసింది కాంగ్రెస్ పార్టే అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్, నల్ల నర్సింహులు బిడ్డ చింతకింది అరుణ, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి, పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్, రాపోలు వీరమోహన్, గుమ్మడిరాజుల సాంబయ్య, సింగారపు రమేశ్, దుస్సా జనార్దన్, పోగు శ్రీనివాస్, మాచర్ల పుల్లయ్య, చెన్నూరి సోమనర్సయ్య, మేడారపు సుధాకర్ పాల్గొన్నారు.

## చదువుకు అడ్డొస్తున్న పేదరికం

- శ్రీనగర్ నిట్‌లో సీటొచ్చినా వెళ్లలేని దుస్థితి
- భారంగా మారనున్న ప్రయాణ, హాస్టల్, కౌన్సెలింగ్ తదితర ఫీజులు
- ఆర్థిక చేయూతనందించాలని విద్యార్థిని వేడుకోలు



అజ్మీరా శిరీష

నర్సంపేట రూరల్, నవంబర్ 5: విద్యార్థిని కష్టపడి చదివి జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్ నిట్ కళాశాలలో ఇంజినీరింగ్‌లో సీటు తెచ్చుకున్నా పేదరికం వెక్కిరిస్తోంది. ప్రయాణ, హాస్టల్, కౌన్సెలింగ్ తదితర ఫీజులు తలకు మించిన భారంగా మారనున్నాయి. ఆర్థిక చేయూతనందించి ఆదుకోవాలని వేడుకుంటున్నది. వివరాలిలా ఉన్నాయి. వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని భోజ్యానాయక్ తండాకు చెందిన అజ్మీరా రాజు-మమత దంపతులది నిరుపేద కుటుంబం. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కూతురు శిరీష ప్రాథమిక విద్య స్థానిక ప్రభుత్వ పాఠశాలలో కొనసాగింది. తండాలో కూలీ పనులు దొరక్కపోవడంతో ఐదేళ్ల క్రితం ఆ కుటుంబం హైదరాబాద్‌కు వలస వెళ్లింది. తండ్రి రాజు హమాలీగా, తల్లి మమత ఇండ్లల్లో పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. కుమారుడు చదువు మానేసి ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తల్లిదండ్రుల కష్టాన్ని కళ్లారా చూసిన శిరీష కష్టపడి చదివింది. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సీరోలులోని టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్‌లో పదో తరగతి, అదే కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. జేఈఈ మెయిన్స్‌లో 79 వేల ర్యాంక్‌తో జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లో బీటెక్ మొదటి సంవత్సరం అడ్మిషన్ పొందింది. తన కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల శ్రీనగర్ వెళ్లి చదవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నది. హాస్టల్, ప్రయాణ ఖర్చులు, ల్యాప్‌టాప్, కౌన్సెలింగ్, ఇతరత్రా ఫీజులు కట్టలేని స్థితిలో ఆ కుటుంబం ఉంది. సంవత్సరానికి దాదాపు రూ.2లక్షల చొప్పున నాలుగేళ్లకు రూ. 8 లక్షల వరకు ఖర్చవుతుందని, తమ ఆర్థిక పరిస్థితి బాగా లేక చదువు మధ్యలోనే ఆగిపోతుందేమోనని శిరీష ఆందోళన వ్యక్తం చేస్తున్నది. దాతలు స్పందించి ఆదుకోవాలని వేడుకుంటున్నది. సెల్ నంబర్ 9701305258కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఆర్థిక సాయం చేసి అండగా నిలవాలని శిరీష, ఆమె తల్లిదండ్రులు కోరుతున్నారు.




రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందుకుంటున్న ఈవో శేషభారతి

## భద్రకాళీ ఆలయానికి 'ఈట్ రైట్ ప్లేస్' సర్టిఫికెట్

వరంగల్, నవంబర్ 5 : భద్రకాళీ ఆలయంలో నాణ్యతతో కూడిన ప్రసాదం తయారీపై భారత ఆహార పరిరక్షణ ప్రమాణాల అధికారిక సంస్థ 'ఈట్ రైట్ ప్లేస్' సర్టిఫికెట్‌ను ప్రదానం చేసింది. ఆలయంలో ప్రసాదాల తయారీ, వంటశాలల పరిశుభ్రతపై ఫుడ్ సేఫ్టీ అధికారులు పలుమార్లు తనిఖీలు చేసిన అనంతరం ఇచ్చిన నివేదిక ఆధారంగా సర్టిఫికెట్ అందించారు. మంగళవారం హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యామిలీ హెల్త్ అండ్ వెల్ఫేర్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఆలయ ఈవో శేషభారతి అందుకున్నారు. సర్టిఫికెట్ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ హరినాథ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యం.. అందని దైన్యం

- ములుగు దవాఖానలో సిబ్బంది కొరత
- ఉండాల్సిన నర్సింగ్ స్టాఫ్ 200 మంది..
- సేవలందిస్తున్నది 30 మంది మాత్రమే..
- ఇబ్బందులు పడుతున్న రోగులు




ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన

ములుగు, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో సిబ్బంది కొరతతో రోగులకు సరైన వైద్యం అందడంలేదు. వరంగల్‌కు 50 కిలోమీటర్ల దూరంలో, గోదావరి పరీవాహక ప్రాంతానికి 100 కిలోమీటర్ల దూరం వరకు ఏకైక దిక్కుగా ఉన్న ఈ ఆస్పత్రి నిత్యం రోగులతో కిటకిటలాడుతుంది. దవాఖానలో 200కు పైగా నర్సింగ్ స్టాఫ్ విధుల్లో ఉండాల్సి ఉండగా కేవలం 30 మంది మాత్రమే సేవలందిస్తున్నారు. దీంతో సదరు సిబ్బంది తీవ్ర పని ఒత్తిడికి గురవుతుండగా, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఏవైనా సమస్య తలెత్తితే సెలవు పెట్టుకొనే పరిస్థితి కూడా ఉండడం లేదని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. కొంతమంది ఉద్యోగులు పని భారం ఎక్కువై అనుమతి లేకుండా సెలవులో వెళ్తున్నారు. అత్యవసర సమయాల్లోనూ తమకున్న సెలవులు వాడుకోవడానికి అవకాశం ఇవ్వడం లేదని మండిపడుతున్నారు. కొంతమంది బదిలీ అయినప్పటికీ ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక స్టాఫ్ నర్స్ రెండు నుంచి మూడు వార్డులు చూసుకోవాల్సి వస్తున్నదని, ఎమర్జెన్సీ విభాగంలో సైతం కొన్ని సందర్భాల్లో ఒకరే పనిచేయాల్సి వస్తున్నదని వాపోతున్నారు. తాత్కాలికంగానైనా, లేక పక్క జిల్లాల నుంచి డిప్యుటేషన్‌పై సిబ్బందిని నియమించి తమకు పనిభారం తగ్గించాలని సిబ్బంది కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రి సిబ్బంది కొరతను తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సింగారం పరిధిలో ఏరడానికి సిద్ధంగా ఉన్న పత్తి పంట

## దూది రైతుకు దుఃఖం

- వేధిస్తున్న కూలీల కొరత
- రూ.500 ఇచ్చి పత్తి ఏరుతున్న వైనం
- పెట్టుబడి రాక తెల్లబోతున్న అన్నదాత

శాయంపేట, నవంబర్ 5 : దూది రైతు దుఃఖంలో మునిగిపోతున్నాడు. ఏటా ప్రకృతి ప్రకోపానికి పత్తి రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో పత్తి ఏరేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. పత్తి పంటతో చేతిలో డబ్బులు మిగులుతాయనుకున్న రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఆరుగాలం శ్రమించి పత్తిని సాగు చేస్తే అధిక వర్షాలతో పలుచోట్ల పంట దెబ్బతిన్నది. కొన్నిచోట్ల మొదటి క్రాప్ బాగా తెల్లగా రావడంతో పత్తిని ఏరుతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ ప్రకటన నేపథ్యంలో రైతులు పత్తి ఏరేందుకు తొందరపడుతున్నారు. దీంతో కూలీలు దొరకడం లేదు. గతంలో పత్తి ఏరితే రోజు కూలీ రూ.250 ఇచ్చేవారు. ఇప్పుడు రోజుకు రూ. 350 ఇచ్చి తీసుకొస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈసారి చీడపీడలు పెద్దగా లేకపోవడం, పత్తి నాణ్యతతో ఉండడంతో రెండో క్రాప్ లేకపోయినా పత్తిని త్వరగా ఇంటికి తీసుకువెళ్లేందుకు ఆరాటపడుతున్నారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి కూలీలను వాహనాల్లో తీసుకొచ్చి సాయంత్రం తిరిగి పంపిస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఒక్కో కూలీకి రూ.500 చెల్లిస్తున్నామని, వాహనాలకు అదనంగా ఖర్చుచేస్తున్నామని రైతులు వాపోతున్నారు. తీరా అమ్మేందుకు మార్కెట్‌కు తీసుకెళ్తే క్వింటాకు రూ.7 వేలకు తక్కువ ధర పలుకుతుండడంతో పెట్టుబడి కూడా రాని దుస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలీల కొరత కారణంగా మొదటి క్రాప్ రాగానే రైతులు పత్తి చేను పీకేసి మక్కజొన్న వేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యానికి తోడు ఖర్చులు బాగా పెరిగి పెట్టుబడి కూడా రాకపోవడంతో తెల్లబంగారం రైతులు తెల్లబోతున్నారు.

## టెలిగ్రాం లింకుతో మోసం

- రూ. 2.15 లక్షలు పోగొట్టుకున్న యువకుడు
- సైబరు క్రైమ్ కేసు నమోదు

రేగొండ, నవంబర్5: గోరికొత్తపల్లి మండలం వెంకటేశ్వర్లపల్లె గ్రామానికి చెందిన యువ కుడు అజ్మీరా గణేశ్ టెలిగ్రాం లింకుతో మోసపోయాడు. ఎస్సై సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గణేశ్ సెల్‌ఫోన్‌కు 15రోజుల క్రితం సైబర్ నేరగాళ్లు హాయ్ అని మెసేజ్ పంపిన తర్వాత ఆదిత్య అని టెలిగ్రామ్ లింక్ పంపి డబ్బులు వస్తాయని జాయిన్ అవమన్నారు. అనంతరం వివిధ టాస్కుల ద్వారా రూ. 2.15 లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ నేరాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తు లు లింకులు పంపితే ఎవరూ ఓపెన్ చేయవద్దన్నారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు 1930 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

## రికార్డ్ అసిస్టెంట్‌పై దాడి ..

**10 గ్రాముల గోల్డ్ చైన్ అపహరణ**

**జనగామ ఏబీవీ డిగ్రీ కళాశాలలో ఘటన**

జనగామ చౌరస్తా, నవంబర్ 5 : జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ కళాశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న భూక్యా ఉపేందర్‌పై దాడి చేసి, అతడి మెడలోని 10 గ్రాముల బంగారు గొలుసును గుర్తు తెలియని ఓ దుండగుడు మంగళవారం అపహరించినట్లు అర్బన్ సీఐ పీ దామోదర్‌రెడ్డి తెలిపారు. బాధితుడిని జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఏబీవీ డిగ్రీ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న భూక్యా ఉపేందర్ మంగళవారం కళాశాల ఫస్ట్ ఫ్లోర్‌లోని లైబ్రరీ తాళాన్ని తీసే క్రమంలో గుర్తు తెలియని ఓ దుండగుడు వచ్చాడు. విజిటింగ్ రిజిస్టర్‌లో తన పేరు అభిషేక్, బీకామ్ థర్డ్ ఇయర్ అని రాశాడు. కొద్దిసేపయ్యాక ఉపేందర్‌పై దాడి చేసి 10 గ్రాముల బంగారు గొలుసును అపహరించి, ఓ బైక్‌పై పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కళాశాల సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితుడి ఆచూకీ కోసం దర్యాప్తు ముమ్మరం చేసినట్లు సీఐ తెలిపారు.

## సెల్‌ఫోన్ల రికవరీలో ముందంజ

- భూపాలపల్లి జిల్లా పోలీసుల ప్రతిభ
- డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేత

భూపాలపల్లి రూరల్, నవంబర్ 5: దొంగిలించిన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీలో జయ శంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసులు ఉత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ చేతుల మీదుగా మంగళవారం ప్రశంసాపత్రాలు అందుకున్నారు. జిల్లా పరిధిలో ఏప్రిల్ 2023 నుంచి అక్టోబర్ 2024 వరకు దొంగిలించిన, పోగొట్టుకున్న 484 సెల్ ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకొని, యజమానులకు అందజేశారు. సెల్‌ఫోన్లను గుర్తించి రికవరీ చేయడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ ఎస్పీ కిరణ్ ఖరే, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. వీరి ప్రశంసా పత్రాలను డీజీపీ భూపాలపల్లి జిల్లా సీఈఐఆర్ పోర్టల్ నోడల్ ఆఫీసర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎన్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ సెల్‌ఫోన్ దొంగతనాల నుంచి విముక్తి కల్పించడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్ సీఈఐఆర్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఈ పోర్టల్ ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్నా, దొంగిలించబడినా వెంటనే సీఈఐఆర్ పోర్టల్ https://www.ceir.gov.in నందు బ్లాక్ చేసి, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్పీ ప్రజలకు సూచించారు.



డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు